

గంధమల్ల చెరువును రిజర్వాయర్‌గా మార్చవద్దని నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

గంధమల్ల రిజర్వాయర్ ఆలోచనను విరమించుకోవాలి

● గంధమల్ల గ్రామస్తుల నిరసన

తుర్కపల్లి, ఫిబ్రవరి 18 : గంధమల్ల చెరువును రిజర్వాయర్‌గా చేయాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య శనివారం అసెంబ్లీలో మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకొని, అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామంలో ఆదివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచులు శ్యాగర్ల వాణీ పరమేశ్, అనుముల వెంకట్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ భాస్కర్ మాట్లాడుతూ గంధమల్ల చెరువును రిజర్వాయర్‌గా మార్చితే మండలంలోని అతిపెద్ద గ్రామమైన గంధమల్లతోపాటు వీరారెడ్డిపల్లి, ఇందిరానగర్, భీమవారిగూడెం గ్రామాలు పూర్తిగా కనుమరుగవుతాయన్నారు. ఆయా గ్రామాల పరిధిలోని భూములు నీట మునుగుతాయని, ప్రభుత్వ విప్ వ్యాఖ్యలతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణానికి ఒప్పుకోబోమని గతంలోనూ చెప్పామని, ఇప్పుడు కూడా అదే మాట అంటున్నామని అన్నారు. ప్రభుత్వ విప్ ఐలయ్య అసెంబ్లీలో రిజర్వాయర్‌గా మార్చాలని చెప్పి.. ఇక్కడికి వచ్చి ఒక టీఎంసీకి పెంచాలని చెప్పానని అనడం సరికాదన్నారు. అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగింపజేసి స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. రిజర్వాయర్ నిర్మాణానికి అంగీకరించేది లేదని, ఎంతటి పోరాటానికైనా సిద్ధమని తేల్చిచెప్పారు. ఇదిలాఉండగా, గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ విప్‌ను యాదగిరిగుట్టలో కలిసి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని వినతి పత్రం అందజేశారు.

పేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం, ఫిబ్రవరి 18 : పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుడిమల్కాపురం గ్రామానికి చెందిన మన్నె భీమారెడ్డికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.75లక్షల ఎల్ఓసీని ఆయన కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. మన్నె నర్సిరెడ్డి, ముద్దంగుల నరసింహ, ధన్‌రాజ్ గౌడ్, జంగారెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లిలో ఎస్ఎఫ్ఐ నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌కు హాజరైన విద్యార్థులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్

చౌటుప్పల్, ఫిబ్రవరి 18 : పట్టణ కేంద్రంలోని మాతృశ్రీ డిగ్రీ కాలేజీలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు, వార్షిక పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు ఈ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ పరీక్షకు వివిధ పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.మహేందర్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె శివకుమార్, నాయకులు దాసరి ప్రకాశ్, మనోజ్, లింగస్వామి పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : పట్టణ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షుడు సుద్దగోని పరమేశ్, నాయకులు నీల కంఠం, శివ, అజయ్, నందు, శశిధర్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

● ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 18 : నూతన విద్యా విధానం చట్టాన్ని రద్దు చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన టీఎస్‌యూటీఎఫ్ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యవస్థలో అంతరాలను పెంచి పోషించేలా వివిధ రకాల పాఠశాలలను ఏర్పాటు చేస్తూ ప్రైవేట్ విద్యారంగానికి ఊతం ఇచ్చేలా వ్యవహరిస్తున్నాయన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ బడి లేకుంటే సామాజిక అంతరాలు పెరిగి సమాజ విచ్ఛిన్నానికి దారి తీస్తాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు ఆటంకంగా ఉన్న కోర్టు కేసులను త్వరగా పరిష్కరించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేసేందుకు అంగన్‌వాడీలను అనుసంధానం చేయాలని సూచించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగానికి భారీ నిధులు కేటాయించాలని కోరారు. అంతకుముందు సంఘం జెండాను ఆవిష్కరించి అమరులైన ఉపాధ్యాయ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మించనున్న టీఎస్‌యూటీఎఫ్ భవన నిర్మాణానికి వ్యాపారవేత్త తొర్ర విష్ణువు రూ.25వేల విరాళం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దామోదర్, సైదులు, కార్యదర్శులు స్వామి, రాజగోపాల్, మండల బాధ్యులు వెంకన్న, కర్ణాకర్, రమేశ్, ఉప్పలయ్య, సోమయ్య, నర్సయ్య, సత్తయ్య పాల్గొన్నారు.



క్రీడాకారులకు జెర్సీలు అందజేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పింగళ్‌రెడ్డి

క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి

● బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి పింగళ్‌రెడ్డి

బీబీనగర్, ఫిబ్రవరి 18 : క్రీడలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి పింగళ్‌రెడ్డి అన్నారు. మండలంలోని రహీంఖాన్‌గూడెంలో నిర్వహిస్తున్న గ్రామస్థాయి క్రికెట్ లీగ్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 120 మంది క్రీడాకారులకు పింగళన్న సేవాదల్ ఆధ్వర్యంలో జెర్సీలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న క్రీడలు యువతలో క్రీడాస్ఫూర్తిని నింపడంతోపాటు వారిలో ఐకమత్యాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడా పోటీలు నిర్వహిస్తున్న యువతను అభినందించారు. మాజీ జడ్పీటీసీ సందిగారి బసవయ్య, మండల కో ఆప్షన్ సభ్యుడు అక్బర్, నాయకులు రఘునందన్‌గౌడ్, మోయిన్, నరేందర్, నర్సింహారెడ్డి, ప్రభాకర్, అస్లాం, నగేశ్, సత్యనారాయణ, సుమన్‌రెడ్డి, శశి, నరసింహ, కుమార్ పాల్గొన్నారు.

20నుంచి విగ్రహాల ప్రతిష్ఠాపన

ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న ఆలయ నిర్మాణ దాతలు, నాయకులు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 18 : మండల కేంద్రంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణోత్సవంలో భాగంగా ఈ నెల 20 నుంచి 22 వరకు కనకదుర్గాదేవి, సంతోషిమాత, కాశీవిశ్వనాతస్వామి, ఆంజనేయస్వామి, గణపతి, సుబ్రమణ్యస్వామి విగ్రహాల ప్రతిష్ఠపన చేయనున్నట్లు ఆలయ నిర్మాణ దాతలు ఏనుగు సురేందర్‌రెడ్డి, సుగంధిని తెలిపారు. పునర్నిర్మాణోత్సవ ఆహ్వాన పత్రికలను ఆదివారం విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యాస కవిత, మాజీ సర్పంచులు పూర్ణచందర్‌రాజ్, హేమలత, చందర్‌గౌడ్, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

వలస కార్మికుడు ఆత్మహత్య

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 18 : మండలంలోని దోతిగూడెం గ్రామంలో ఓ వలస కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాలు ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం కట్ని జిల్లా ఇంద్రజితకి దపి గ్రామానికి చెందిన ఓం ప్రకాశ్ (39) కూలి పని కోసం 18 సంవత్సరాల క్రితం దోతిగూడెం గ్రామానికి వచ్చాడు. అద్దె రూములో ఉంటూ ఎస్వీఆర్ కంపెనీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. మద్యానికి బానిసైన ఓం ప్రకాశ్ ఆదివారం గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా దవాఖానకు తరలించారు.

కురుమ సంఘం నూతన కమిటీల ఎన్నిక

రాజాపేట, ఫిబ్రవరి 18 : మండలంలోని రఘునాథపురం, నర్సాపురం గ్రామాల్లో కురుమ సంఘం గ్రామ కమిటీలను ఆ సంఘం కన్వీనర్ వస్పరి సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎమ్మా శ్రీను, బీజన నరేందర్, ఉపాధ్యక్షులుగా ఎమ్మా ఇస్తారి, రాసూరి వెంకటేశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమాల్లో నర్సయ్య, వెంకటేశ్, బక్కయ్య, సిద్ధులు, బాలమల్లయ్య పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

చౌటుప్పల్, ఫిబ్రవరి 18 : మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లసింగారం గ్రామానికి చెందిన నాగిళ్ల మీనయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. నిరుపేద అయిన ఆయన కుటుంబానికి మాజీ సర్పంచ్ సుర్వి నర్సింహగౌడ్ ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో కృష్ణ, బాలయ్య, గణేశ్, మారయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రామీణ క్రీడలు

గుండాల, ఫిబ్రవరి 18 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన మోత్కూరు పాత తాలూకా స్థాయి గ్రామీణ క్రీడోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం వివిధ మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులు కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పీఈటీలు నర్సిరెడ్డి, మహేష్, అమర్, పూర్వ విద్యార్థులు యాదగిరి గౌడ్, ఎండీ షర్ఫొద్దీన్, నరేశ్ పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడల్లో భాగంగా కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

వచన కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి, కవులు, రచయితలు

కవి కాలంతోపాటు నడువాలి

● కాళోజీ పురస్కార గ్రహీత వెంకటేశ్వర్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 18 : కవి సమాంతర కాలాన్ని అధ్యయనం చేస్తూ దానితోపాటు కలిసి అడుగులు వేసినప్పుడే అత్యుత్తమ కవిత్వాన్ని అందివ్వగలుగుతాడని ప్రజాకవి కాళోజీ పురస్కార గ్రహీత కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని రాయగిరి ప్రభుత్వ పాఠశాలలో జిల్లా రచయితల సంఘం, ప్రజాభారతి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు, కవి తోట వెంకటేశ్వర్‌రావు వచన కవితా సంపుటిని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తెలుగు, ఇంగ్లిషు భాషల్లో ప్రావీణ్యం కలిగిన తోట వెంకటేశ్వర్‌రావు కొన్ని దశాబ్దాలుగా కవిత్వాలు రాస్తూ వస్తున్నారని, ఆ క్రమంలో భిన్న వస్తువులను తీసుకొని తనదైన శైలిలో మంచి కవిత్వం రాస్తూ సాహిత్యప్రియుల అభిమానాన్ని చూరగొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పోరెడ్డి రంగయ్య, కవులు బాలకుల్ల శ్రీకాంత్, దేవినేని అరవిందరాయుడు, పెసరు లింగారెడ్డి, బండారు జయశ్రీ, పాండాల మహేశ్వర్, గజ్జెల రామకృష్ణ, బండి సూర్యారావు, పలుగుల సతీశ్, బాలకుల్ల శ్రీరాములు, అనిల్ పాల్గొన్నారు.

సహస్ర ఘటాభిషేకంలో భాగంగా స్వామివారికి జలం తీసుకొస్తున్న భక్తులు

మార్కండేశ్వరస్వామికి సహస్ర ఘటాభిషేకం

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 18 : పట్టణంలోని మార్కండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి సహస్ర ఘటాభిషేకం ఘనంగా నిర్వహించారు. మహిళలు జల బిందెలతో స్థానిక టూరిజం పార్కు నుంచి ర్యాలీగా వెళ్లి స్వామివారికి జలాభిషేకం చేశారు. ఆలయంలో యజ్ఞం, పూర్ణాహుతి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సహస్ర ఘటాభిషేకం కర్తలకు అన్న ప్రసాదం చేశారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ బడుగు చండికేశ్వర్, ఉపాధ్యక్షుడు బోగ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి రుద్ర బాల రాజు, కోశాధికారి మంగళపల్లి రాజారమేశ్, ధర్మకర్తలు యాదగిరి, బాలరత్నం, రమేశ్, కృష్ణ, యాదగిరి, సిద్ధిరాములు, యాదగిరి, బాలనరసింహ, భార్గవి, రాజ్యలక్ష్మి, వరమ్మ, పారిజాత పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత

● ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

మార్కండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి ఆదివారం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో సత్కరించారు.

మార్కండేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

వన జాతరకు ముస్తాబైన యాదాద్రి మేడారం

చల్లూరులో ముస్తాబైన సమక్క గద్దె

రాజాపేట, ఫిబ్రవరి 18 : మండలంలోని చల్లూరు గ్రామంలో యాదాద్రి మేడారం వన జాతరకు అన్ని ఏర్పాట్లు చేశారు. నూతనంగా గద్దెల నిర్మాణం చేపట్టి రంగులతో తీర్చిదిద్దారు. ఈ నెల 20న ఎల్లమ్మ బోనాలు, 21న సారలమ్మ గద్దెపైకి రావడం, 22న సమ్మక్క గద్దెపై ఆశీనులు కానున్నారు. 23న వన దేవతలకు పూజలు, 24 అడవి తల్లుల వన ప్రవేశంతో జాతర ముగియనుంది. స్థానికంగా జరిగే ఈ జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలి రానుండగా.. ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

పూజల్లో పాల్గొన్న భక్తులు

ఘనంగా నల్ల పోచమ్మతల్లి వార్షికోత్సవాలు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 18 : పట్టణంలోని పోచమ్మవాడలో నల్ల పోచమ్మతల్లి ఆలయ పుష్కర వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాల ఊరేగింపు, జలాధివాసం, గోపూజ, గణపతి పూజ, పుణ్యావచనం, రక్షాబంధనం తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు.

అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

రంగనాయకస్వామి ఆలయ నూతన కమిటీ

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 18 : మండలంలోని పెద్ద రావులపల్లి గ్రామంలో గల భూనీలా సమేత రంగనాయకస్వామి దేవాలయ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా జడల అంజయ్య, ఉపాధ్యక్షుడిగా చేగూరి ప్రభాకర్, కార్యవర్గ సభ్యులుగా చిలుక బుచ్చయ్య, ఏనుగు కొండల్‌రెడ్డి, మరిపాల యాదయ్య, పల్లా విష్ణువర్ధన్‌రెడ్డి, పెద్దబోయిన రామకృష్ణ, గుర్రాల శంకరయ్య, కందాల గణేశ్, చెన్నబత్తిని నాగభూషణ్, సంగం గణేశ్, వర్కాల బాలచందర్, మోటి బాలకృష్ణ, పంతంగి భానుప్రకాష్‌చారి ఎన్నికయ్యారు.

కొమ్మ కొమ్మకూ కొంగలు

రాజాపేట, ఫిబ్రవరి 18 : మండలంలోని కుర్రారం ఊర చెరువులో ఎండిన చెట్లపై కొంగలు రాత్రి వేళల్లో సేద తీరుతున్నాయి. పాములు, అడవి పిల్లుల బారిన పడకుండా ఇలా చెరువు నీళ్లల్లో ఉన్న ముళ్ల చెట్లపై నివాసం ఏర్పాటు చేసుకున్నాయి. ఎండిన చెట్లపై గుంపులుగా ఉన్న ఈ తెల్లని కొంగలు చెట్లకు పూసిన పూల గుత్తులుగా కనువిందు చేస్తున్నాయి.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న యువజన సంఘం నాయకులు

రామన్నపేట, ఫిబ్రవరి 18 : మండలంలోని బోగారం గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మేడి కృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత విగ్రహం ఏర్పాటుకు సహకరిస్తున్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ బోడ కాసీం, అంతటి రమేశ్, సత్తయ్య, గోపాల్, రాంచంద్రారెడ్డి, శోభారాణి, ఐలయ్య, మల్లేశం, రవీందర్, కిరణ్, నర్సింహ పాల్గొన్నారు.

వరికి అగ్గి తెగులు

● ఎర్రబారుతున్న పైరు
● రాత్రి ఉష్ణోగ్రతలే కారణం
● సస్యరక్షణ చర్యలు పాటించకుంటే తీవ్ర నష్టం

మోత్కూరు, ఫిబ్రవరి 18 : వరి పంటను అగ్గి తెగులు ఆశించి రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నది. దీంతో పైరు రోజురోజుకూ ఎర్రబారుతున్నది. వాతావరణంలో వస్తున్న మార్పుల ప్రభావం వరిపై ఎక్కువ ప్రభావం చూపుతున్నదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. నత్రజని (యూరియా) అధిక మోతాదులో వాడడం ద్వారా అగ్గి తెగులు ఉధృతి మరింతగా వ్యాప్తి చెందుతుందని పేర్కొంటున్నారు. రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోవడం, పగటి ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలు ఉన్నప్పుడు అగ్గి తెగులు వ్యాప్తి ఎక్కువగా ఉంటున్నది. దీనిని సకాలంలో గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, లేకుంటే తీవ్ర నష్టం తప్పదని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

అగ్గి తెగులు లక్షణాలు

వరి పంటకు తొలి దశలో ఆకులపై నూలు కండె ఆకారంలో మచ్చలు ఏర్పడి క్రమేణా పెద్దవై చివర్లు మొనదేలి ఉంటాయి. ముదురు గోధుమ రంగులో ఆకులు పూర్తిగా ఎండిపోతాయి. పిలకల దశ నుంచి కాండం కణుపు వరకు తెగులు సోకితే కుళ్లిపోతాయి. వరి పంట ఈనిక దశలో మెడపై నల్ల మచ్చలు ఏర్పడి మెడ విరుపు తెగులుగా మారుతుంది. దీంతో గింజలు తాలు పోతాయి. అగ్గి తెగులు సోకిన పంట దిగుబడి శాతం బాగా తగ్గిపోతుంది.

నివారణ చర్యలు

వరి పంటకు అగ్గి తెగులు సోకితే అందుబాటులో ఉన్న వ్యవసాయాధికారుల సూచనలు పొందాలి. వారి సూచన మేరకు మందులు పిచికారీ చేయాలి. అగ్గి తెగులు సోకిన పంటకు లీటరు నీటికి ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లేదా ఐసోప్రోథయోలిన్ 1.5 ఎం.ఎల్ చొప్పున కలుపుకొని రెండు వారాల్లోపు రెండు సార్లు పిచికారీ చేయాలి. అధిక నీటి వాడకం తగ్గించడం శ్రేయస్కరమని అధికారులు సూచిస్తున్నారు

దిగుబడులపై తీవ్ర ప్రభావం

వరి పంటలో అగ్గి తెగులును సకాలంలో గుర్తించకపోవడం వల్ల సరైన మందులు పిచికారీ చేయకపోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రతి క్లస్టర్‌లో ఏఈఓలు ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉంటున్నారు. వారి వద్దకు వెళితే సలహాలు, సూచనలు అంద జేస్తారు. వ్యవసాయ శాఖ సిబ్బంది చేసిన సూచనలను రైతులు పాటించడం ద్వారా దిగుబడి పెంచుకోవచ్చు.

– కె.స్వప్న, మండల వ్యవసాయ అధికారి, మోత్కూరు